క్లుప్తంగా

వైభవంగా పొంగళ్ల సేవ


అంకమ్మ తల్లి అమ్మవారు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెంలోని శ్రీ అంకమ్మ తల్లి వార్షికోత్సలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారికి పొంగళ్ల సేవ, మొక్కుబడుల చెల్లింపు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల్లో అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పొంగళ్ల సేవ, మొక్కుబడుల చెల్లింపునకు భక్తులు హాజరై అంకమ్మ దేవరను దర్శించుకున్నారు. శుక్రవారం అంకమ్మతల్లికి అన్నాభిషేకాన్ని నిర్వహిస్తున్నామని, అలానే భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అంకమ్మతల్లిని దర్శించుకోవాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

పన్ను వసూళ్లలో అలసత్వం వద్దు


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శ్రీమన్నారాయణ

స్వర్ణ(కారంచేడు): గ్రామాల్లో ఈ ఏడాది 2024–25 సంవత్సరాలకు సంబంధించిన ఇంటి పన్ను వసూళ్ళను నూరు శాతం పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని చీరాల డీఎల్పీఓ శ్రీమన్నారాయణ అన్నారు. గురువారం స్వర్ణ గ్రామ సచివాలయాలను పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ మోటాని మధుసూదనరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

సంతరావూరు రైల్వే గేటు మూసివేత


సంతరావూరి రైల్వే గేటు ఇదే..

వేటపాలెం: మండల కేంద్రం వేటపాలెం నుంచి సంతరావూరు వెళ్లే మార్గంలో రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం ఐదు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు. ఈ నెల 27 నుంచి మార్చి 3వ తేదీ వరకు అసౌకర్య ఉంటుందన్నారు. కాగా ఈ మార్గం నుంచి ఇంకొల్లు, తిమ్మసముద్రం, సంతరావూరు, గొనసపూడి ప్రాంతాలకు వెళ్లే వారితో పాటు.. గేటు అవతల తుఫాన్‌పేట, రాధాకృష్ణాపురం, యానాది సంఘం, అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులకు తిప్పలు తప్పవు. ఇంకొల్లు వైపు వెళ్లే వాహనాలు కడవకుదురు మీదుగా తిరిగి ఇంకొల్లు చేరుకోవాల్సి ఉంటుంది.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

అద్దంకి రూరల్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్న పార్టీ కార్యాలయ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలాల నాయకులు, కార్యకర్తలు తరలివాలని కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం శతభిషం నక్షత్రం అమావాస్య తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆర్టీసీ ఆదాయం రూ.8 లక్షలు

చీరాల అర్బన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చీరాల డిపో నుంచి పల్నాడు జిల్లా కోటప్పకొండకు నడిపిన ప్రత్యేక బస్సులు ద్వారా రూ.8 లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ జె.శ్యామల గురువారం తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు మొత్తం 45 బస్సులను నడిపినట్లు తెలిపారు. స్పెషల్ బస్సుల్లో ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణించారన్నారు. సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఊరంతా శుభ్రం.. వారికి కష్టం

- జీతాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ఎదురుచూపులు
- ఆరు నెలలుగా జీతాల్లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


జీతాల కోసం చీరాల ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

చీరాల టౌన్: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సేవ చేసే సిబ్బందికీ తిప్పలు తప్పడంలేదు. ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ఉండే పారిశుద్ధ్య కార్మికులు తెల్లవారు జామునుంచే గ్రామాల్లోని వీధులను శుభ్రం చేసి.. బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేస్తుంటారు. కానీ వారి బతుకుల మాత్రం మారడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఠంచనుగా నెలనెలా జీతాలు అందుకునే వారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో నెలల తరబడి జీతాల రాక.. అప్పులు పుట్టక అల్లాడుతున్నారు. చాలీచాలనీ వేతనాలు కూడా సక్రమంగా రాక, పెరిగిపోతున్న నిత్యావసర వస్తువులు కొనలేక, అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వెళ్లలేక పోతున్న వారి పట్ల పాలకులు, అధికారులు కనికరం చూపడంలేదు. కనీసం వారికి ఇవ్వాల్సిన సబ్బులు, చెప్పులు, నూనెలు కూడా ఇవ్వడంలేదు. చీరాల రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీలు, వేటపాలెం మండలంలో 9 గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్టు పద్ధతిలో 24 గ్రామ పంచాయతీల్లో కార్మికులున్నారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 65 మంది, వేటపాలెం మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో 60 మంది కలిపి మొత్తం 135 మంది పనిచేస్తున్నారు. కానీ వీరిలో చాలా మందికి ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నారు. చెత్తచెదారాల తొలగింపుతో పాటు, కార్యాలయం స్వీపర్లుగా, వాచ్‌మెన్లుగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. కానీ కాంట్రాక్టర్లు ఇష్టారీతిన మాత్రమే కూలీలు ఒక్కో కార్మికుడికి రోజుకు రూ. 370 నుంచి రూ.400 వరకు మాత్రమే రోజుకు కూలి ఇస్తారు. కానీ గత ఆరు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని.. వెంటనే ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

వేతనాలు ఇవ్వకుంటే ఆందోళన

పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య. ప్రభుత్వం, మండల, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేతనాలు ఇవ్వాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం. ఒక్కో కార్మికుడికి కనీస వేతనం రోజుకు రూ.394 ఇవ్వాల్సిందే. పంచాయతీ ఆదాయాన్ని బట్టి తక్కువ వేతనం అందించడం దారుణం.

– ఎం.వసంతరావు, సీఐటీయూ మండల కార్యదర్శి, చీరాల

నిధులు లేకనే జీతాల చెల్లింపుల్లో జాప్యం

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేది కాంట్రాక్టర్లు. పంచాయతీకి ఇస్తున్న ఆదాయం నుంచి వీరికి నిధులు మంజూరు చేస్తారు. పంచాయతీలకు సరిగా ఆదాయం లేకపోవడంతోనే కార్మికులకు జీతాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడింది. 15 ఫైనాన్స్ నిధుల లేకపోవడం, అన్నింటికీ సాధారణ నిధులను వాడటం వలనే జీతాలు సక్రమంగా అందించడం లేదు. పది రోజుల్లోపు పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేలా కృషి చేస్తా. అలానే ఇంటిపన్నులు వసూళ్ల చేసి మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటా.

– రామకృష్ణ, ఈఓఆర్డీ, చీరాల

వైభవంగా శివపార్వతుల కల్యాణం


ఉత్సవ విగ్రహాల కల్యాణోత్సవం


కారంచేడు మల్లేశ్వరస్వామివారి ఆలయంలో కన్నుల పండువగా శాంతికల్యాణం


కారంచేడు శివాలయంలో స్వామివార్ల శాంతి కల్యాణంలో భక్తులు

బల్లికురవ: నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో బోడిలింగాలపాడు వద్ద స్వయం భూ వెలసిన భ్రమరాంబసమేత మల్లిఖార్జునుడికి మహాశివరాత్రి పర్వదిన వేడుకలు బుధ, గురువారాల్లో వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఇంకోల్లు సుధీర్‌శర్మ, మధుబాబుతో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. గురువారం ఉదయం భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వైభవంగా కల్యాణం నిర్వహించారు. వ్యాపారవేత్తలు భైరపనేని అజయ్, చల్లగుండ్ల రాంబాబు, ఆధ్వర్యంలో 1500 మందికి అన్నసంతర్పణ చేపట్టారు.

శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ

కారంచేడు: శివనామ స్మరణలతో శివాలయాలు మారుమోగాయి. బుధవారం అర్ధరాత్రి 11 గంటల నుంచి గురువారం వేకువజాము వరకు సాగిన మహాశివరాత్రి పర్వదిన ప్రత్యేక పూజలతో భక్తులు పులకించిపోయారు. కారంచేడు, స్వర్ణ గ్రామాల్లోని శివాలయాలతో పాటు, గ్రామ దేవత గంగమ్మతల్లి, హరేరామ ఆశ్రమం, కట్టమల్లేశ్వరస్వామివారి దేవాలయంలో లింగోధ్భావ పూజలు నిర్వహించారు. పెదబజారు శివాలయంలో స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు.

ఆధునిక వ్యవసాయంతో దిగుబడి


పచ్చి మిర్చి రైతులతో మాట్లాడుతున్న రమణారెడ్డి


కేశవరప్పాడులో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సుధీర్‌బాబు


ఉప్పుమాగులూరులో మాట్లాడుతున్న ఏఓ


బైటమంజులూరులో పంటలను పరిశీలిస్తున్న అధికారులు


అద్దంకి: పొలంబడిలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

జె.పంగులూరు: ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముప్పవరం, బైలమజుంలూరులో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయన్నారు. అంతేకాక ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన మందుల విశేషాలు లేని పంటలను పండించి ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. రబీ 2024–25 కాలానికి సంబంధించి పంట నమోదు కార్యక్రమం మార్చి 3వ తేదీకి ముగుస్తుందని తెలిపారు. రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సిందిగా కోరారు. వీఏఏలు పృథ్వీ, దిల్జా, రైతులు పాల్గొన్నారు.

కేశవరప్పాడు (కారంచేడు): శనగ పంటలో కనిపిస్తున్న తెగుళ్ల నివారణకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏఓ కె. సుధీర్‌బాబు అన్నారు. గురువారం రంగప్పనాయుడు వారిపాలెం, కేశవరప్పాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలు చేశారు. శనగ పంటలో ఎండు తెగులు, వేరుకుళ్ళు తెగుళ్ళ నివారణకు తప్పనిసరిగా రాబోవు రోజుల్లో పంట మార్పిడిని చేపట్టాలన్నారు. భూమి సారవంతం కోసం పశువుల ఎరువులతో పాటు, ట్రైకోడెర్మావిరిడీ మందును ఎకరాకి 4 కేజీల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు బిందుమాధురి, రైతులు పాల్గొన్నారు.

చీరాల టౌన్: పచ్చి మిర్చి సాగు చేసే రైతులకు సాగు ఖర్చులు రాకపోగా మిర్చి పంటకు సరైన ధర లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్న మిర్చి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కావూరివారిపాలెం, తోటవారిపాలెం గ్రామ పంచాయతీల్లో సాగు చేస్తున్న మిర్చి పంటలకు రైతు విభాగం అధ్యక్షుడు పరిశీలించారు. ఎకరాకి ఒక్కో రైతుకు రూ.75వేలు నష్టం వస్తుందని రైతులు తమను ఆదుకోవాలని కోరారు. దీనిపై రమణారెడ్డి మాట్లాడుతూ పచ్చి మిర్చి సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కిలో పది రూపాయలకే అమ్ముకోవాల్సి వస్తోందన్నారు.

అద్దంకి రూరల్: గింజనాణ్యత కొరకు పొటాష్ చివరి దఫాలో వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని ఉలప్పపాడు, మైలవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్నలో ఎకరాలకు 25 కేజీల పొటాష్ చివరి దఫాలో వేసుకోవాలని సూచించారు. దీని వలన గింజ నాణ్యతతో పాటు బరువు పెరుగుతుందని తెలిపారు.

ఇ– పంట నమోదు చేయించుకోండి

బల్లికురవ: రబీలో సాగుచేసిన పంటలను మార్చి 3వ తేదీ లోపు ఇ– పంటలో నమోదు చేయించుకుని ఈకేవైసీ పూర్తి చేయించాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. గురువారం ఉప్పుమాగులూరు సోమవరప్పాడు గ్రామాల్లో మొక్కజొన్న, నువ్వు పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పీఎం కిసాన్ రాష్ట్ర ప్రభుత్వం అందించే పలు పథకాలను పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు 11 అంకెల యూనిక్ నంబర్ పొందాలని కోరారు. ఖరీఫ్ ఆరంభ పైర్లకు ముందు తొలకరి పంటగా పచ్చిరొట్ట పైర్లు సాగుతో భూమిలో కలియ దున్నడం వలన భూసారం పెరుగుతుందని వివరించారు. వీఏఏలు, హరికృష్ణ హనుమానాయక్ పాల్గొన్నారు.

తిరునాళ్ల హుండీల ఆదాయం లెక్కింపు


కొత్తపాలెంలోని బాలకోటేశ్వర ఆలయంలో లెక్కిస్తున్న దృశ్యం


సోపిరాల రామకోటేశ్వర ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

చినగంజాం: సోపిరాల రామకోటేశ్వర ఆలయం, కొత్తపాలెంలోని బాలకోటేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా భక్తుల ద్వారా వచ్చిన హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులు లెక్కించారు. రామకోటేశ్వర ఆలయంలో జరిగిన లెక్కింపులో రూ.7,67,938 ఆదాయం వచ్చింది. గత ఏడాది రూ.7,57,270 రాగా.. ఆదాయం పదివేల రూపాయలు పెరిగింది. కొత్తపాలెం బాలకోటేశ్వర ఆలయంలో హుండీ ఆదాయం రూ.1,5,500 వచ్చింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పీఎస్‌ఆర్ ఆంజనేయులు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనే లక్ష్యం


అవగాహన కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు

చీరాల: నాటు సారాయి నిర్మూలనే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ కె. విజయ అన్నారు. గురువారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాన్ని గురువారం చీరాల మండలం రామ్‌నగర్‌లో నిర్వహించారు. ఎక్సైజ్ సిబ్బంది, ఈఎస్‌టీఎఫ్ బాపట్ల సిబ్బందితో కలిసి గ్రామస్తులతో అవగాహన కల్పించారు. గ్రామస్తులకు నాటుసారా వలన కలిగే నష్టాలను, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నాటు సారా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలానే ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను, క్రైం ఆఫ్‌టేక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విష్ణుమూర్తికి నివాళులర్పించిన గాదె


విష్ణుమూర్తి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదన రెడ్డి

పర్చూరు (చినగంజాం): మండలంలోని గర్నెపూడికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెద్దపల్లి విష్ణుమూర్తి భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్ రెడ్డి గురువారం నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అలానే ఇటీవల మృతిచెందిన గొల్లపూడి గ్రామానికి చెందిన బొల్లాపల్లి ప్రవీణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇడుపులపాడు గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు అంబటి వీరనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పారు. ఆయన వెంట మండల కన్వీనర్ కఠారి అప్పారావు, నాయకులు లంకా శివ, అడుసుమల్లి జగన్నాథం, గొల్లపూడి సర్పంచ్ రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ నూతలపాటి బలరాం, బండి రాంబాబు, ఇంకొల్లు మండల నాయకులు చిన్ని పూర్ణారావు, ఎంపీటీసీ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి


ఉపకరణాలు అందిస్తున్న రెవరెండ్ దేవదాసు, నానిబాబు, యూత్ సభ్యులు

చీరాల రూరల్: పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఏడాది కాలంపాటు చదువుకున్న పాఠ్యాంశాలను ధైర్యంతో, ఆత్మ విశ్వాసంతో రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని రెవరెండ్స్ పిల్లి దేవదాసు, నానిబాబు అన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కోసం గురువారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చదువుకున్న పాఠ్యాంశాలను గుర్తు పెట్టుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. చెడు మార్గాలను విడనాడి భక్తి విశ్వాసాలతో సన్మార్గంలో నడవాలని పేర్కొన్నారు. అనంతరం 500 మంది విద్యార్థులకు ప్రార్థనా పూర్వకంగా పెన్సిళ్లు, పెన్నులు, ఇతర ఉపకరణాలను అందించారు. చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పచ్చ జెండా


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్ర

- రూ. 15 కోట్లతో మినీ బైపాస్‌కు ఏకగ్రీవ తీర్మానం
- 15వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌ల నిర్మాణం
- అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు
- 40 అంశాలను ఆమోదించినట్లు ప్రకటించిన చైర్‌పర్సన్

అద్దంకి: స్థానిక మున్సిపల్ హాలులో బుధవారం నిర్వహించిన సాధారణ సమావేశంలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది. ఈ సమావేశాన్ని చైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అధ్యక్షతన కమిషనర్ రవీంద్ర నిర్వహించారు. దానిలో భాగంగా జెండాలోని 46 అంశాలను సీనియర్ అసిస్టెంగ్ అర్జునరావు చదివి వినిపించగా అందులో ఆరు అంశాలు మినహా మిగిలిన అన్ని అంశాలను అమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. ఆమోదించిన అంశాల్లో ముఖ్యంగా పట్టణంలోని రామానగర్ సమీపంలోని ఎన్నెస్పీ కాలువ కట్టపై నున్న ఆక్రమణలను తొలగి మినీ బైపాస్ నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దాని కోసం కట్టపై నివశిస్తున్న పేదలకు శింగరకొండ సమీపంలోని సర్వే నంబరు 2218లో 75 ప్లాట్లు, మరి కొందరికి బొమ్మనంపాడు లే అవుట్‌లో ప్లాట్లు కేటాయించేందుకు నిర్ణయించారు. అదే విధంగా ఒక పొక్లెయిన్ కొనుగోలు, ఆఫీస్ మెటీరియల్, గార్బేజ్‌ల ఏర్పాటు, వివిధ వార్డుల్లో సీసీ రహదారులు, సీసీ డ్రైనులు నిర్మాణం, గ్రావెల్ రహదరులు, కాంపేక్టర్ మెషీన్, వేసవి దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేసే అంశాలున్నాయి. దేవాలయాలకు, మసీదులకు పన్ను మినహాయింపు ఇచ్చే అంశంలో భాగంగా ఒక మసీదుకు పన్ను మినహాయింపు అంశం, స్టాండింగ్ కౌన్సిల్ వేతనం పెంపు, అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఎక్కడ పడితే అక్కడ పట్టణంలో ఏర్పాటు చేయవద్దనే అంశంతోపాటు, రుసుం వసూలుకు పాట నిర్వహించే అంశాలను కౌన్సిల్ చర్చించి ఆమోదం తెలిపింది. అన్ని అంశాలను ఆమోదిస్తున్న చైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ ప్రకటించారు. సమావేశంలో కౌన్సిలర్లు, మునిసిపల్ మేనేజర్ శ్రీదేవి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ రహిత పంచాయతీల ఎంపిక


మాట్లాడుతున్న అధికారులు

అద్దంకి రూరల్: మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గోపాలపురం, ఉప్పలపాడు, పేరాయపాలెం గ్రామంచాయతీలు టీబీ రహిత పంచాయతీలుగా ఎంపిక చేసినట్లు జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ సాధిక్ గురువారం తెలిపారు. 2024 సంత్సరానికి సంబంధించి అన్నిరకాల టీబీ పరీక్షలకు గాను ఆ గ్రామాల్లో జీరో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు.. ఒంటిపై స్పర్శలేని మచ్చలు ఉంటే ఆశలు, ఏఎన్‌ఎంలను సంప్రదించాలన్నారు. వైద్యాధికారులు శ్రీహర్ష, ఎస్‌టీఎస్ రాజశేఖర్, వెంకటరత్నం, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, మోదేపల్లి నోడల్ అధికారి ఎస్‌కెపి సత్తార్ పాల్గొన్నారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ

ఒంగోలు మెట్రో:

శ్రీవారిని సామూహికంగా దర్శించుకున్న శ్రీవారి భక్తులుగా మనందరం అదృష్టవంతులం అనడంలో ఎలాంటి సందేహం లేదని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం అన్నారు. శివునికి అత్యంత ప్రీతికర మాఘమాసంలో అలంకార ప్రియుడు వేంకటేశ్వరుని గిరి ప్రదక్షిణ చేసుకుని స్వామివారిని దర్శించుకోవడం అత్యంత ఆనందదాయకమన్నారు. గురువారం ఉదయం స్థానిక శ్రీగిరి పాద పీఠం వద్ద బాపూజీ గో సంరక్షణ గోశాల వద్ద గోపూజ నిర్వహించుకుని వందలాది భక్తులు గోవింద నామ స్మరణ చేస్తూ సుందరంగా అలంకరించిన పల్లకిపై శ్రీనివాసుని కొలువు తీర్చి ఎంతో ఉత్సాహంగా స్వామివారి పల్లకిని తమ భుజస్కంధాలపై పెట్టుకొని భక్తులు గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. మార్గమధ్యలో భగీరథ మహర్షి మందిరం వద్ద సగరపుత్రులు గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు పాల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉపాధ్యక్షుడు దాసరి నారాయణరావు, కోశాధికారి వలేటి కృష్ణారావు, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, చలువాది బ్రహ్మయ్య, ధనిశెట్టి రామునాయుడు, గో సంఘం వాసు, సామి రాఘవేంద్రరావు, బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, కనమర్లపూడి బాల, దేసు చిన్నా పాల్గొన్నారు.